ఉగాదులూ, ఉషస్సులూ

పేరంటమునకేగు పిన్న బాలిక వాలుజడలో మల్లెపూవు కనిపించినప్పుడు, శీతోదక స్నానజాత సౌఖ్యము పైన ముక్కుపుటాన చెమర్పు పుట్టినప్పుడు, ఒకదినాన పికాలాపం దూరపుకోన నుంచి వినవచ్చినప్పుడు వసంత మరుగు దెంచిందన్న మధురోహ తమకు స్ఫురించినట్టుగా సెలవిచ్చారు కవిగారు.

అణువు నుంచి బ్రహ్మాండం వరకూ చరా చరాలన్నిటిలోను అందాన్ని తిలకించగలిగిన కవిరాజులకు వసంతం వచ్చేసిందన్న తలపు అదొక మధురోహగానే భాసించవచ్చు, సందేహం లేదు. కానీ ప్రతి విషయానికీ బొమ్మా, బొరుసూ అంటూ రెండు ముఖాలు వుండనే వుంటాయి తప్పదు. ఇంతలోనే మళ్ళీ ఒక సంవత్సరం కాల గర్భంలో కలిసిపోయిందన్న కటిక సత్యం ఊహకు తట్టినప్పుడు నడుస్తూ నడుస్తూ వున్న మానవుడు ముందుకు వేసిన అడుగు ముందుకు, వెనక్కు వేసిన అడుగు వెనక్కు అలాగే ఉంచేసి కాసేపు స్తంభించిపోక తప్పదు.

నా మట్టుకు నేను సంవత్సరాని కొకసారి యిలా స్తంభీభూతుడినై పోవలసి వస్తుంది. అందుకు కారణం మా నరసయ్య మామ ప్రశ్న!

"కొత్త పంచాగాలొచ్చేశాయా బాబూ?"

నరసయ్య మామ అందుకని మాయింటికి రాడు. అతడిది బాట ప్రక్కన భారీ సేద్యం. ఆ బాట వెంబడే నరసయ్య మామ పొలాల్ని దాటుకుని యింకా రెండు మూడు ఫర్లాంగులు నడిస్తేగానీ నేను నా గమ్యస్థానాన్ని చేరుకోలేను. మా నరసయ్య మామ పరిభాషలో నా యీ గమ్యస్థానానికి 'పలుకూట' మని పేరు. పలుకూటంలో పలువురు పిల్లలతో పరివేష్టితుడనై కాలమొకరీతిగా వెళ్ళ బుచ్చుతున్నందుకు ప్రతిఫలంగా నాకు నెల నెలకూ ఎంతో కొంత పైకం ముడుతున్న మాట నిజమే! ఐతే ఈ జీతంలో బడికి రాక పోకలు సల్పుతూ, సల్పుతూ నరసయ్య మామ ప్రశ్నలకు జవాబు చెపుతున్నందుకు ఎంత యిస్తున్నారో, 'ఊరుకోండర్రా ఊరుకోండి. సైలన్స్, సైలన్స్' అని గొంతు చించుకుంటూ కుర్రాళ్ళలో క్రమశిక్షణ నిరవాకం చేస్తున్నందుకు ఎంత యిస్తున్నారో, 'బాబ్బాబూ! ఈ ప్రోనోటు కాస్తా వ్రాసి పెట్టండి' అంటూ ప్రాధేయపడ్డం మొదలు 'సాయంత్రం మా యింటిదాకావచ్చి పత్రాలు, దస్తావేజులు చూసిపోవలసింది.' అంటూ కోర్టు సమన్లులావచ్చి పైనబడే ఆజ్ఞలదాకా అన్నింటిని శిరసావహిస్తున్నందుకు ఎంత యిస్తున్నారో, కాగా పిల్లలకు పాఠాలు చెపుతున్నందుకు మాత్రం గిట్టుబాటవుతున్నదెంతో నాకు తెలియదు.

ఈ కార్యకలాపాల్లో గూడా మిగిలినవన్నీ ఒక ఎత్తు - మా నరసయ్య మామ ప్రశ్నలకు జవాబు చెప్పడం మాత్రం ఒక ఎత్తు.

అసలు మా నరసయ్య మామ ప్రశ్నలవాహిని ఏనాడూ వట్టి పోని జీవనదిలాంటిది. భోజరాజును చూడగానే కవిత్వం పుట్టుకొచ్చినట్టు, దూరం నుంచీ నా ముఖాన్ని చూడగానే అతడికి ఓ ప్రశ్న చటుక్కున స్ఫురిస్తుంది.

ఈ ప్రశ్నల్లో రోజువారీ ప్రశ్నలు కొన్ని :

"ఈ రోజు రాహు కాలమెప్పుడు బాబూ?"

పిలుపులు, పెటాకులూ లేకపోయినా భోజనానికి ఆయత్తమై వచ్చి, స్వయంగా తనే పీట వేసుకొని కూర్చునే అతిథిలాంటి పెద్ద మనిషి ఈ రాహువు. గ్రహాలు తొమ్మిదని అనుకున్న తర్వాత వాటిలో రెంటికి మాత్రం బంతిలో ఎందుకు చోటు లేక పోవాలో తెలియదు. రాహువుకే గనుక ఒక రోజు ప్రత్యేకించి వుంటే, ఆది వారానికి బదులుగా ఆ రాహు వారాన్ని 'పబ్లిక్ హాలిడే'గా పరిగణించి కాలు కదలకుండా అందరూ యిళ్ళలోనే కూర్చుని ఈగలు తోలుకోడానికి వీలుండేది! ఎంతో శిష్టుడైతేగానీ, తనకు అన్యాయం జరిగినపుడు తిరగబడకుండా వుండలేడు. రాహువు శిష్టగ్రహం కానేకాదు, దుష్టగ్రహం. పైగా వక్రగ్రహం. పంచాంగంలో అతడిది పంచమాంగదళం లాంటి వ్యవహారంగా వుందంటే అందులో ఆశ్చర్యమేమీలేదు.

ఉద్యోగంలో చేరి పేటకూ, పల్లెకూ రాకపోకలు ప్రారంభించిన క్రొత్తలో ఓ రోజు ఉదయం అదును దున్నతున్న నరసయ్య మామ నన్ను చూడగానే నాగలి నిలిపి 'రాహుకాలమెప్పుడ'ని అడిగాడు. నా కప్పటికి మరిచి పోయింది మరిచిపోగా మిగిలివున్న వ్యాకరణ శాస్త్ర వాసన వల్ల భూత భవిష్యద్వర్తమానకాలాన్ని గురించి కొంత తెలుసుగానీ, రాహుకాలాన్ని గురించి బొత్తిగా తెలియదు.

'నేరనన్న వాడు నెరజాణ. నేర్తునన్న వాడు నింద జెందు' అన్నాడు గదా వేమన్న! అసమర్ధతను ప్రకటించుకోవడం ఉచితమైనప్పుడు, అజ్ఞతను మాత్రం ఎందుకు ప్రకటించుకోకూడదు అనుకుని 'రాహుకాలమా? అబ్బే. నాకు తెలియదే!' అని తలవంచుకుని నా దారంట నేను వెళ్ళిపోజూచాను.

'అయ్యో, అదేమిటి బాబూ! అలాగనేశావు!' అంటూ నావైపు ఆశ్చర్యంగా చూశాడు నర్సయ్య మామ. "రాహు కాలం ఫలానప్పుడు అని చెప్పడానికి బద్ధకమా? అయ్యో రామ! మీతాతగారుండే వారు, పుణ్యాత్ములు గదటయ్యా? అడక్క పోయినాసరే, 'ఒరే నరసయ్యా! ఈరోజమావాశ్య. పెద్దలకు ఓ విస్తరి వేయడానికి మరచిపోయేవు' అని ఆయనే స్వయంగా చెప్పేవారు. ఆయన పోయారనుకో. మీ నాన్నగారు మాత్రం? తిథి, వారం నక్షత్రం ఏదడిగితే అది టక్కుటక్కున చెప్పేసేవాడు గదటయ్యా!"

పెద్దల మంచితనం గూడా ఒక్కొక్కప్పుడు భావితరాల పిన్నలకు ఉపద్రవకర మేమో ననిపిస్తుంది. ఐనా మరేం పరవాలేదు. ఈ మాత్రం నిష్ఠూరంతో నరసయ్య మామ బారినుంచి తప్పించుకో గలిగానన్న తృప్తితో మౌనంగా వెళ్ళిపోయాను.

కానీ నరసయ్య మామ నన్ను అంతటితో వదలి పెట్టే ఘటమని భావించడంలో నేను ఘోరమైన భ్రమా ప్రమాదానికి లోనయ్యానన్న విషయం నాకా మరునాటి ఉదయమే విశదమైంది.

"రాహుకాల మెప్పుడని అడిగితే చెప్పక పోయావు. పోనీలే నాయనా! అంతలో వుంది. ఆ మనుషులా, ఆకాలమా!" అంటూ విడివిడిగా మాటలు కొన్ని వల్లించి "అది సరేగానీ ఈ రోజు ఏప్రక్క వారశూల?" అని ఒక సరిక్రొత్త ప్రశ్నను నాపైకి విసిరాడు నరసయ్య మామ.

వారశూల! కడుపుశూలలతో బాధపడుతున్న వాళ్ళని కొంత మందిని నేనెరుగుదును. కడుపులో శూలం తీసుకుని కుమ్మినట్లుండడంవల్ల ఈ బాధకు కడుపుశూల అని పేరు వచ్చిందని గూడా ఎవరో వివరించారు. కానీ ఈ వారశూల వృత్తాంతమేమిటి? ఇది ఎవర్ని, ఎక్కడ బాధిస్తుంది?

"వారశూలా నరసయ్య మామా? మరి....మరి...." అంటూ గుటకలు మ్రింగసాగాను.

"అదీ తెలియదని చెప్పేద్దామని చూస్తున్నావల్లే వుంది. అంతేగదూ!" అన్నాడు నరసయ్య మామ.

"ఆహఁ, అదిగాదు. మరిచి పోయినట్టున్నాను, జ్ఞాపకం చేసుకుని మధ్యాహ్నం చెబుతానులే" అంటూ వడివడిగా నడక సాగించాను.

మధ్యాహ్నం కావడానికి ఎంతసేపు పడ్తుంది? ఆ లోపల నేనీ వారశూలలను గురించి తెలుసుకోక తీరదు. మెల్లగా ప్రధానోపాధ్యాయుల్ని సమీపించి 'అయ్యా! ఇదేమిటో రాహు కాలమనీ, వారశూలలనీ కొన్ని ఈతిబాధలు మానవ జాతిని వేధిస్తున్నట్టు తెలియ వచ్చింది. ఆయీ విషయాల్ని గురించి తెలుసుకోడానికి నాకొక ఉద్గ్రంథాన్ని సూచించగలరా?' అని వినయంగా ప్రాధేయపడ్డాను.

ఆయన ముసి ముసి నవ్వుల్ని వెదజల్లుతూ మొదటి తరగతి కుర్రాడినొకణ్ణి కేకవేసి ఒక పుస్తకాన్ని తెప్పించి "చూడవయ్యా మేష్టారు! ఇది పెద్ద బాలశిక్ష! మొదట దీన్ని చదివి ఒంటబట్టించుకోడం మంచిది. రాహుకాలం, వారశూలల్ని గురించి మాత్రమే గాక యింకా అనేక ముఖ్య విషయాలిందులో వుంటాయి. 'పోయెను, వచ్చెను మొదలగు వ్యవహారంబులకు కారణంబైన భగవత్స్వరూపంబే కాలంబు. అట్టి కాలం బఖండంబైనను గ్రహరాశి నక్షత్రాద్యాత్మకంబై జ్యోతిశ్చక్రమునందు దిరుగుచున్న సూర్య చంద్రుల గతి బట్టి అఖండ కాలమునందు ఖండకల్పనంజేసి జనులు వ్యవహారము జరిగింతురు.' ఇదంతా ఏదో ఉబుసు పోకకు చెబుతున్నాననుకోకు. పంచాంగానికి సంబంధించిన ప్రాథమిక విషయాలు తెలియకపోతే పల్లెటూళ్లో బడి పంతులుగా చలామణి కావడం కష్టం. ఆ తరువాత నీ యిష్టం" అన్నారు.

'ఎంత పని చేశావయ్యా నరసయ్య మామా' అనుకుంటూ 'పాడ్యమి, విదియ, తదియ' అనుకుంటూ తిథుల్ని 'మేషము, వృషభము' అనుకుంటూ రాశుల్ని, 'అశ్వని, భరణి, కృత్తిక' అనుకుంటూ నక్షత్రాల పట్టికను అధ్యయనం చేశాను.

'అంగార పూర్వే గమనేచ లాభం సోమే శని దక్షిణమర్థ లాభం' అంటూ ప్రయాణానికి అనుకూల వారాల్ని గురించి, 'నపూర్వే శని సోమేచ, నగురుర్దక్షిణే తథా....' అంటూ ప్రయాణ నిషిద్ధ వారాల్ని గురించి శ్లోకాలు నోటి పాఠం చేసుకున్నాను.

నారికేళ పాకంలో ఉన్న కవిత్వంలా మొదట మొదట అయోమయంగా కనిపించిన పంచాంగం, రానూ రాను కొంచెం కొంచెం అవగతం కాసాగింది.

కానీ పంచాంగం చూడ్డానికి తెలియడం వేరు. ప్రతిరోజూ, అదొక దినకృత్యంగా పెట్టుకొని 'ఈ రోజు తిథేమిటి, నక్షత్ర మేమిటి, యోగమేమిటి' అని తెలిసివుంచుకోడం వేరు!

బజారునుంచీ ఒక వస్తువు తెమ్మని ఒకసారికి బదులు నాలుగుసార్లు చెప్పినప్పటికీ మరచిపోయి రావడమే మామూలైనప్పుడు ఈ తిథులూ, గిథులూ, నక్షత్రాలు మాత్రం ఎలా జ్ఞాపకముంటాయి?

కానీ నా సాధక బాధకాలతో నరసయ్య మామకు ప్రసక్తి లేదు. అతడికి కావలసిందల్లా అతడి ప్రశ్నకు జవాబు! పాడ్యమి ఎప్పుడు? పంచమి వెళ్ళి పోయిందా? అమావాస్య ఎప్పుడొస్తుంది?

అనుభవానికి మించిన ఆచార్యుడు లేడన్నారు. కాలక్రమాన నేను మా నరసయ్య మామకు బదులివ్వడానికి ఒకటి రెండు సులభ పద్ధతుల్ని అన్వేషింప గలిగాను.

"పంచమా నరసయ్య మామా! నిన్నగాక మొన్ననే గదూ పున్నమి...."

"పున్నమి ఆదివారంనాడు గదటయ్యా?"

"ఓ, అవునవును, ఆది సోమ మంగళ బుధ..... ఈ రోజు బుధవారం. రేపు గురువారం. అలాగైతే పంచమి రేపేనన్న మాట!" ఇదీ మొదటి పద్ధతి.

"అమావాస్యా నరసయ్య మామా! మరి...." అని నేను కాసేపు ఆలోచనను అభినయించగలిగితేచాలు, ఒకటి రెండు క్షణాలు తమసించి మా నరసయ్యమామే "ఆ నీలకంఠయ్యేమో చెప్పాడు. పైవచ్చే సోమవారమేనని...." అని తనే సమాధానాన్ని సరఫరా చేసేవాడు.

"సోమవారమని చెప్పాడా? అవునవున్లే నరసయ్య మామా! సోమవారమే అమావాస్య!" అంటూ నేను ముక్తాయించేశానంటే అప్పటి కాగండం తప్పిపోయినట్టే!

నరసయ్య మామకు నాలాటి వారెంతమంది లేరు గనుక! అతడి కెప్పటికప్పుడు ఏదో ఒక పర్వదినాన్ని గురించి తెలుసుకోవలసిన అవసరం వుండనే వుంటుంది. దీపావళి పండుగ నవంబరు రెండో తేదీన వస్తుందనుకోండి. ఆరోజు కోసం నరసయ్య మామ ఎంతో ఆదుర్దాగా వేచివుంటాడు. ఆ పండుగా తీయటి కలలా వచ్చి అంతలోనే అంతర్ధానమైపోతుంది. అదలా వెళ్ళిందో లేదో, మూడో తేదీ ఉదయమే ప్రశ్నిస్తాడు నరసయ్య మామ – "సంక్రాంతి పండుగ ఎప్పుడు బాబూ?" ఆ సంక్రాంతి పండుగ ఆరు నూరైనా, నూరు ఆరైనా తన రివాజు ప్రకారం జనవరి పద్నాలుగో తారీఖు నాటికి తప్పనిసరిగావచ్చి హాజరు పలుకుతుంది. సంక్రాంతికి మరునాడు పశువుల పండుగ. ఆ మరునాడు పారువేట పదిహేడో తేదీ ఉదయానికల్లా నా కోసం మరొక ప్రశ్న సిద్ధంగా వుంటుంది.

"కొత్త పంచాంగాలొచ్చేశాయా బాబూ?"

"కొత్త పంచాంగాలు రాకేంచేస్తాయి నరసయ్య మామా? తప్పకుండా వస్తాయి" అని నేను సమాధానమివ్వవలసి వస్తుంది.

వెంటనే ప్రశ్నల పరంపర–

"ఐతే ఆ సంక్రాంతి పురుషుడీసారి దేనిపైన ఎక్కాడు? ఏ దిక్కుగా వెళ్ళాడు? ఎలాంటి బట్ట కట్టుకున్నాడు? ఏం తిన్నాడు?...."

ఈ సంక్రాంతి పురుషుడెవడో గానీ, ఇతగాడు గుణగణాల్లో శని గ్రహానికి ప్రాణమిత్రుడుగాను, రాహుకేతువులకు తోడల్లుడుగాను ద్యోతకమౌతాడు. బహుశా ఇతడు పురాణాల్లో వికృత స్వరూపులుగా వర్ణించబడిన రాక్షసులకు, కొన్ని కొన్ని జానపద చలన చిత్రాల్లో నరుల్ని అరచేతిలో నిలబెట్టుకునే బేతాళురకు, గలివరు బ్రాబ్డింగుకు నాగు దేశంలో కనిపించిన మహాకాయులకు మూల పురుషుడై వుంటాడు! ఇతడి ఆకారం అంత వికారం! "అష్టవక్రో విశాలాక్షో, లంబభ్రూ దీర్ఘనాసికః – ద్విముఖం కృష్ణ వర్ణంచ, కురూపంచ త్రినేత్రకం....సప్తబాహుం ద్విపాదంచ" పనిలో పనిగా ఇతడి స్వరూపాన్ని చిత్రింపదలచుకున్న చిత్రకారులకు ఒక మనవి. స్కేలు విషయికంగా కాస్తా అప్రమత్తత అవసరం! ఏభై మైళ్ళకొక అంగుళమని నిర్ధారించుకున్నప్పటికీ, ఈ ఆకారాన్ని చిత్రించడానికి ఇరవై అంగుళాల పొడవున్న డ్రాయింగు పేపరు కావలసి వస్తుంది. ఎందుకంటే, ఈ సంక్రాంతి పురుషుడి ఎత్తు 900 మైళ్ళు; ఛాతీ చుట్టుకొలత 96 మైళ్ళు!

ఆకారం సంగతలా వుండగా ఇంచుమించుగా యితడి చేష్టలన్నీ అరిష్ట సూచకాలు: ఎరుపు రంగు వస్త్రం కట్టుకున్నాడా, యుద్ధం తప్పదన్నమాటే! మెడలో పొగడపువ్వులదండ వేసికొన్నాడా, ఆకటి బాధలు చెప్పతరంగావు. వెండినగలు ధరించాడూ ఇక లోహాల కన్నింటికీ వినాశమే! ఎక్కింది వరాహమైతే యిక వచ్చిందే నల్లజీవాల కన్నింటికీ ముప్పు! ఇన్ని హంగులతో యితడే దిక్కుగా వెళ్తున్నాడో, ఆ దిగ్భాగంలో వున్న దేశాల్లో క్షామం చెలరేగుతుంది. దారిద్ర్య దేవత విశృంఖలంగా వీర విహారం చేస్తుంది. లేదూ-ఒక్కొక్కప్పుడు యిందుకు విరుద్ధంగా వర్షాలు బాగా పడినా పడవచ్చు. అయితే అప్పుడది అతి వృష్టి మాత్రమే అవుతుంది. జలోపద్రవాల్తో దేశం అతలాకుతలమైపోతుంది. రోగాలు విచ్చలవిడిగా వ్యాపిస్తాయి. మునుపటి కెవరో భార్య భర్తను దెప్పినట్లుగా అది అతివృష్టిగానివ్వండి, అనావృష్టిగానివ్వండి-ఎలాగైనా ముప్పు మాత్రం మనుషులకే!

యుద్ధాలకు, ఈతిబాధలకు లౌకిక కారణాలను వివరిస్తే మా నరసయ్య మామ వినిపించుకోడు. లోకంలోని సర్వానర్థాలకు సంక్రాంతి పురుషుని లీలలే కారణమని అతడి అచంచల విశ్వాసం.

ఆ మాటకొస్తే మా నరసయ్య మామ పంచాంగాన్ని చింపి పోగులుపెట్టి, యిక నక్షత్రాలే లేవు పొమ్మంటే ఆ మాట తిరుగులేని సత్యమని నమ్మేస్తాడు!

మా నరసయ్య మామ బహు కుటుంబీకుడు. గవర్నమెంటు వారు చౌక దుకాణాలు పెట్టిన రోజుల్లో అతడిది నలభైయేడు యూనిట్ల రేషన్ కార్డు. ఐదుగురు కొడుకులు, ముగ్గురు కూతుళ్ళు పెళ్ళిళ్ళయి కాపురాలు చేసుకుంటున్నారు. కోడళ్ళను పుట్టినింటినుంచి తీసుకరావడమో, కూతుళ్ళను సారెపెట్టి అత్తగారింటికి పంపడమో నెలకు రెండు మూడు ప్రయాణావసరాలుంటాయి. మునసబుగారి జననమరణ రిజిష్టరులో అతడికి ఏడాదికి ఏ నాలుగైదు సార్లయినా పని తగులుతుంది. పిన్నా, పెద్దా; ఆడా, మగా; పిల్లా, జిల్లా క్రిక్కిరిసి వున్న సమిష్టి కుటుంబంలో అప్పుడప్పుడూ యిలాంటిదేదో జరగడంలో విడ్డూరం లేదు. ఉన్నట్టుండి ఒక శుభోదయాన నరసయ్య మామ నన్ను నడిరోడ్డులో నిలవేసి "నిన్న సాయంత్రం మా నారిగాడి పెళ్ళాం నీళ్ళాడింది" అంటాడు. ఇక అప్పటి నుంచీ నా అవస్థలు ప్రారంభం! జన్మకాలాన్ని గుర్తించాలి. నక్షత్రాన్ని బట్టి ఆ పుట్టిన బిడ్డ కొక పేరు సూచించాలి. ఉండి వుండి ఒక ఆడబిడ్డ 'శ్రవణం'లో జన్మిస్తుంది. 'జూ,జే,జో,ఘ-శ్రవణం'. ఆలోచించగా, ఆలోచించగా 'జూ'కు జూలియా, 'జే'కు జేన్ ఆస్టిన్, 'జో'కు జోన్ ఆఫ్ ఆర్కులాంటి నామధేయాలు కొన్ని నాకు స్ఫురిస్తాయి. ఇలాంటి పేర్లు మా నరసయ్య మామకు నచ్చవని ప్రత్యేకించి చెప్పడం అనవసరం! ఏదో గంతకు తగిన బొంతగా ఒక మామూలు పేరు సూచించమని అతడు నా దుంప తెంచడానికి పూనుకుంటాడు. పదేళ్ళుదాటిన కుర్రదాన్ని, పదహారేళ్ళ కుర్రవాణ్ణి వివాహోచిత వయస్కులుగా పరిగణిం చేస్తాడు నరసయ్య మామ. వరులకోసం, వధువుల కోసం అన్వేషణ ముమ్మరంగా జరుగుతుంది. జాతకాలు కుదరాలి. పేరు పొంతనాలు సరిపడాలి. ఆ తరువాత పెళ్ళి ముహూర్తాన్ని నిర్ణయించాలి....

ఎలాగైనా ఈ గొడవను సదలించుకోదలచి నాకూ అతడికి గూడా తీరిక దొరికినప్పుడు నేను మెల్లమెల్లగా కాస్తా శుక్రనీతినీ ఏకరువు పెట్టడం కద్దు- "పెళ్ళి, సీమంతం, నామకరణం లాంటి శుభ కార్యాలకు పంచాంగాన్ని పాటించడం సముచితమేగావచ్చు కానీ ఊరగాయలు వేయడం మొదలు, ఊరికి వెళ్ళడం దాకా

అంతకూ, యింతకూ పంచాంగాన్ని పట్టుక వేల్లాడడం అవివేకమే అవుతుంది. సాహెబులున్నారు వాళ్ళ పెళ్ళిళ్ళకు శుక్రవారం మధ్యాహ్నం పదకొండు గంటలకు సరిగా ముహూర్తం కుదురుతుంది. అంటే మంచి రాహుకాలమన్న మాట! వాళ్ళేం చెడిపోయారు? సుగాలీలని, పిచ్చిగుంటల వాళ్ళనీ, దాసర్లనీ పొట్ట చేతపట్టుకుని దేశంపైన తిరిగే జాతులు వెయ్యివున్నాయి. మా కుగాదులు లేవు, మాకుషస్సులు లేవు అన్నట్టుగా, వాళ్ళకు జాతకర్మలూ లేవు. జాతకాలూ లేవు. వాళ్ళల్లో వివాహాలు చెట్టుక్రింద, గుట్ట ప్రక్కన గుట్టుచప్పుడుగా జరిగిపోతాయి. అలాగని వాళ్ళ దాంపత్య జీవితం ఆనందంగా గడవడం లేదని ఎవరు చెప్పగలరు? ఏవో కొన్ని విశ్వాసాలు మానవుడి కవసరమేగానీ, హద్దు మీరినప్పుడు ఎంతమంచి విశ్వాసమైనా చాదస్తమనే అనిపించుకుంటుంది...."

రామాయణమంతా విని సీతకు రాముడేంకావాలని ప్రశ్నించినట్టుగా "నీ మాటలకేంలేవయ్యా! దొంగతనానికి గూడా మంచి ముహూర్తం చూచుకుని బయల్దేరమన్నారు. అదిసరేగానీ, రేపు మడికి నారు పోయాలి. మంచి రోజేనేమో చూడు" అంటాడు నరసయ్యమామ.

ఒక్క నారు పోయడానికి మాత్రమేమిటి, చెరకు నాటడానికి, గాను గెత్తడానికి, తమలపాకుల తోటలో తీగ దించడానికి – యిలాంటివన్నింటికీ మంచిరోజే కుదరాలి నరసయ్యమామకు.

బండలు పగిలే భరణి కార్తి, రోళ్ళుపగిలే రోహిణి కార్తి వెళ్ళిపోగానే మా నరసయ్యమామ మోర పైకెత్తి ఆకసంవైపు చూస్తూ వుండిపోతాడు. చినుకు నేలపైన పడి 'ఆరుద్దుల' కార్తిలో గింజ భూమిలో పడితేగానీ అతడి ప్రాణాలు కుదుటపడవు. కానీ ఋతుధర్మాలు ఋతువర్ణనల్లో కనిపించినంత సక్రమంగా లోకంలో ప్రవర్తిల్లడం లేదుగదా! 'అంతర్ప్రగర్జన్మ హాంబోధరమ్ములు, నీల నమ్రస్నిగ్ధనీరదములు.' ఒక్కొక్కప్పుడు వర్షఋతువంతా వేచిచూచినా కనిపించవు. జల్లుజల్లుమని కురిసే జడివానమ్రోత జలజాక్షి కాలిగజ్జల చప్పుడుగా, హోరుహోరునవీచే సుడిగాలిమ్రోత వెలది ఆలాపించు రాగమాలికగా, వెయ్యి ఒయ్యారాల వర్షలక్ష్మి విశ్వరంగం పైన నృత్యమొనర్చే దృశ్యం స్వప్న సాదృశంగా మాత్రమే మిగిలిపోయి, ఉత్తర కార్తిదాకా నేల చిత్తడి కాక, వర్ష ఋతువుసైతం విఘాతాన్నే తలపించే గడ్డు రోజుల్లో "ఈ కార్తిలో గూడా వానయోగం లేదా బాబూ?" అని దీనంగా ప్రశ్నిస్తాడు నరసయ్యమామ!

అప్పుడు నేను మా నరసయ్య మామకు కాస్తా భూగోళశాస్త్రం గూడా బోధించడం కద్దు!

"వాన యోగానికేం నరసయ్యమామా! పంచాంగంలో ప్రతి కార్తికి అతివృష్టి అనో, పర్వత వృష్టి అనో ఏదో ఒక వివరం వ్రాయబడి వుంటుంది కానీ పంచాంగ కర్త పీఠికలోనే 'ఈ సంవత్సరం మేఘపాలకుడు ఫలానావాడు కావడంవల్ల ఖండవృష్టి కురియును' అని ఉదహరించివుంటాడు. ఖండవృష్టి అంటే ఏమిటి? వర్షం ఎక్కడో ఒకచోట పడుతుంది మిగిలినచోట్ల పడదు. ఆఫ్రికా ఖండంలో సహారా అన్న పేరుతో పెద్ద ఎడారి ఒకటివుంది. అక్కడ సంవత్సరానికంతా ఒకటి రెండు దుక్కుల వానపడితే బ్రహ్మాండం. మనదేశంలో చిరపుంజి అన్న ప్రదేశముంది. అక్కడ ఏడాది పొడుగునా సరాసరి రోజు కొక్క పదును వాన కురుస్తుంది. అంతెందుకు, మన తెలుగు ప్రాంతంలోనే ఒక వైపున దేశం వరదల్లో మునిగి తేలుతుంటే మరొక వైపున క్షామ రాక్షసి బీభత్సం

కనిపిస్తుంది. ఆ మాటకొస్తే వర్షం కురవడానికి గానీ, కురవక పోవడానికి గానీ, కారణం ఋతుపవనాలు. అవి నైరుతి ఋతుపవనాలనీ, ఈశాన్య ఋతుపవనాలని రెండు రకాలు. పడమటి కనుమలు అడ్డు తగలడంవల్ల నైరుతి ఋతుపవనాలు, తూర్పు కనుమలు అడ్డు తగలడంవల్ల ఈశాన్య ఋతుపవనాలు మనకు వర్షాన్ని చాలినంతగా ప్రసాదించడంలేదు......."

నిజానికింత దూరం నా ప్రసంగం సాగడానికి వీలుండదు. మధ్యలో ఎక్కడో అడ్డుతగిలి "ఇదేం గొడవ నాయనా! నన్నెగతాళి చేస్తున్నావేమిటి?" అంటాడు నరసయ్యమామ.

యథార్థాన్ని ఎగతాళి క్రింద జమకట్టే నరసయ్య మామ యెదుట అప్పుడు నేను ప్రకాశంగా కాస్త ఊహాగానం సల్పవలసి వస్తుంది.

"వెన్నెల కొన్నాళ్ళు, చీకటి కొన్నాళ్ళు గదా నరసయ్య మామా! గడిచిందంతా చీకటే ననుకో. రాబోతున్నదే వెన్నెల! వానకోసం అర్రులు చాచుకుని మింటివైపుచూస్తూ కూర్చునే రోజులు గతించాయి. వర్షంతో ప్రమేయం లేకుండా పైర్లు పండించుకోడానికి వీలుగా ప్రాజెక్టులు నిర్మాణ మౌతున్నాయి. గొట్టపు బావుల ద్వారా పాతాళగంగ పైకి పెల్లుబుకుతోంది. అంతేకాదు, కృత్రిమంగా ఎప్పుడంటే, అప్పుడు ఎక్కడంటే అక్కడ వర్షం కురిపించడానికి గూడా ఉపాయాల్ని అన్వేషిస్తున్నారు. నువ్వు నీ అరవయ్యేళ్ళ పైచిలుకు వయసులో రేడియో చూచావు, బయస్కోపు చూచావు. అవసరమైనప్పుడు ఓ బిస త్రిప్పగానే నీ పొలంలో ఒక పదునువాన కురిసే రోజులు గూడా నీకళ్ళముందర రావచ్చు. ఏం, ఎందుకు రాగూడదు?"

కరువు కాటకాలకు మారొడ్డి భూమితల్లితో పోరాడుతున్న తరతరాల వ్యవసాయ జీవనానికి ప్రతినిధిలా మా నరసయ్య మామ నా మాటల్ని వింటూ వింటూ చల్లగా నవ్వుకుంటాడు.

♦ 'ఆంధ్రప్రదేశ్' మాస పత్రిక - 1974 ♦